క్లుప్తంగా

ఇంధన పొదుపు వారోత్సవాలు



ఇంధన పొదుపుపై అవగాహన కల్పిస్తున్న ఏఈ రాధాకృష్ణ

వేలేరుపాడు: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వేలేరుపాడు, కుకునూరు మండలాల్లో నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ జంగారెడ్డిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో వేలేరుపాడు కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాలలో, కుకునూరు జెడ్పీ హైస్కూల్‌లో ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పారిశ్రామికంగా, సాంకేతికంగా ఉన్నతిలో ప్రపంచానికి ఇంధనం ఎంతో విలువైన వనరని తెలిపారు. పరిమితంగా ఉన్న ఈ వనరులను భావితరాలకు అందించాలంటే పొదుపుగా వినియోగించుకోలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కుకునూరు ఏఈ పాపారావు, వేలేరుపాడు జేఈ గోలు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



అభినందన పత్రం అందజేస్తున్న అనంత శ్రీరామ్

కొయ్యలగూడెం: విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసేందుకు కళలను ప్రోత్సహించాలని, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందజేయాలని తెలుగు సినీగేయ రచయిత అనంత శ్రీరామ్ కోరారు. సరిపల్లి ఎంవీఆర్ స్కూల్‌లో ఇటీవల వెయ్యిమందికి పైగా విద్యార్థులతో నిర్వహించిన జాతీయ సమైక్యత ప్రదర్శనకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, తానా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కడంతో వారికి ఆయన ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో తపన ఫౌండేషన్ చైర్మన్ జీఎస్ఆర్ చౌదరి, జానపద కళాకారుడు ఎల్ఆర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ రవి మహేష్ తదితరులు పాల్గొన్నారు. బయ్యనగూడెంలో ముత్యాలమ్మ తల్లిని అనంత్ శ్రీరామ్ దర్శించుకొని పూజలు చేశారు.

నాలుగో రోజుకు పోస్టల్ ఉద్యోగుల సమ్మె



జంగారెడ్డిగూడెం హెడ్‌పోస్టాఫీసు వద్ద సమ్మె

జంగారెడ్డిగూడెం: ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరింది. ఏలూరు డివిజన్ ఏఐజీడీఎస్‌యూ యూనియన్ సభ్యులందరూ సమ్మెలో పాల్గొని ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. కమలేశ్ చంద్ర కమిటీ డిమాండ్స్ అంగీకరించే వరకు సమ్మె కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు, సెక్రటరీ ఎస్ఎస్ బాజీ, వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజు, అసిస్టెంట్ సెక్రెటరీ దుర్గారావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తుల నుంచి రూ. 25,040 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపాడు మండలంలోని వసంతవాడ గ్రామ శివారు పంట పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.25,040 నగదు, ఒక బైక్, 7 సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

అమరజీవికి ఘన నివాళి

ఏలూరు(మెట్రో): ఆంధ్రరాష్ట్ర సాధనకు అమరుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభ ఏలూరు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటేశ్వర్లు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్‌వీ నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ పుష్పలతతో కలిసి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ శ్రీరాములు చేసిన పోరాటం నిరుపమానమైనదన్నారు. గాంధేయ మార్గంలో 56 రోజులపాటు నిరాహారదీక్ష చేసి అమరులయ్యారని గుర్తుచేశారు. వారి ప్రాణత్యాగాన్ని తెలుగుజాతి ఎన్నటికీ మరువదని అన్నారు. ఆయన ఆశయాలు తెలుగువారందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ ఆఫీసర్స్ ఎస్‌టీఓ జి.గణేష్‌బాబు, బి.సాంబశివరావు, డీఈఓ ఎం.మురళీకృష్ణ, బీసీ హాస్టల్ వార్డెన్స్, బీసీ వెల్ఫేర్ సిబ్బంది, కలెక్టరేట్ కార్యాలయం సిబ్బంది పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

అభివృద్ధిని స్వాగతిస్తున్న ప్రజలు

ఎమ్మెల్యే ఎలీజా



తడికలపూడి గ్రామంలో మహిళకు పథకాల బుక్లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు ఘనంగా స్వాగతిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శుక్రవారం కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామ సచివాలయం -2లో 214వ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరించారు. పథకాల బుక్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమ లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వివరించారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ఇంటికే సంక్షేమ పథకాలు అందించి, ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. అందుకే గ్రామంలో ఏ ఇంటికెళ్లినా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. ఏమైనా ఇబ్బంది ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అందరి ఆదరణ అభిమానాలతో, వైఎస్సార్ సీపీకి ఓటేసి, జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. టీడీపీ మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబా, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ పందు జగదీష్, సచివాలయ కన్వీనర్ వెర్రి శ్రీను, చింతలపూడి ఏఎంసీ డైరెక్టర్ బొట్ల లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల విజిలెన్స్, మోనిటరింగ్ మెంబర్ గుర్రాల రవికుమార్, ఈడుపుగంటి ప్రసాద్, పొద్దుటూరి పండు, మండల అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఆలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు



వేళంగిని మరియమ్మ మందిరాన్ని ప్రారంభించిన బిషప్ జయరావు

లింగపాలెం : ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా సమాజంలో రుగ్మతలను రూపుమాపటానికి దోహదపడతాయని ఏలూరు బిషప్ పొలిమెర జయరావు అన్నారు. శుక్రవారం లింగపాలెం మండలం అన్నపనేనివారిగూడెం గ్రామంలో నిర్మించిన వేళంగిని మరియమ్మ తల్లి మందిరాన్ని ఆయన ప్రారంభించారు. పీఠాధిపతులతో పాటు అనేక మంది గురువుతో సమష్టిగా దివ్యబలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు మాట్లాడుతూ క్రీస్తు చూపించిన ప్రేమను ఇతరులకు పంచి సహోదరభావంతో కలిసిమెలిసి జీవించాలని అన్నారు. మరియమ్మ ఆశీస్సులు ఈగ్రామ, ప్రాంతంపైన ఎల్లప్పుడూ మెండుగా ఉండాలని దీవించారు. దేవుడుకి మానవుడికి మధ్య ఎల్లప్పుడూ మరియమాత వారిధిగా ఉండి మావవాళి కోరికలను తీరుస్తుందని చెప్పారు. యువత సమాజాభివృద్ధికి అంకితభావంతో పనిచేసేందుకు చొరవచూపాలన్నారు. క్రైస్తవులు ప్రేమతో జీవించాలని, క్రీస్తు మార్గంలో పయనిస్తే పరలోక ప్రాప్తి కలుగుతుందని వివరించారు. క్రీస్తుమార్గం ప్రస్తుత సమాజాన్ని సన్మార్గంలో పయనింపజేయటానికి దోహదపడుతుందని అన్నారు. అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సంఘస్తులు, ఫాదర్స్, పాస్టర్లు బిషప్ జయరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాశ్యానగరం విచారణ గురువులు యేసురత్నం, సంఘకాపరి అందుగుల రత్నకుమార్, పలు విచారణలకు చెందిన ఫాదర్స్, పాస్టర్లు, సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో మెగా సేవా శిబిరం



మెగా క్యాంపును ప్రారంభించిన ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో 10 రోజులపాటు మెగా సేవా శిబిరం శుక్రవారం ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు ఇతర సేవా కార్యక్రమాలపైనా అవగాహన ఉండాలని, సేవా భావాలు యువత నుంచి మొదలైతే అవి చిరస్థాయిలో నిలుస్తాయని అన్నా రు. ఎన్ఎస్ఎస్-1 విభాగ అధిపతి నిట్టా వినయ్, ఎన్ఎస్ఎస్-2 విభాగ అధిపతి గల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ డాంగేనగర్‌లోని రెండు భాగాలను దత్తత తీసుకొన్నామని, ఈ పది రోజులు విద్యార్థులతో సేవా కార్యక్రమాలతో పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అధ్యాపకులు ఎం మధు, యు.వెంకటాచార్యులు, సీహెచ్ బదరీ నారాయణ, పీఎస్ రావు, వి.హనుమంతరావు, ఎం శ్రీనివాసరావు, సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ టీమ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ఏలూరు(మెట్రో): లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి సంబంధించి ఏర్పాటుచేసిన సమావేశానికి ఆర్డీఓ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో స్కానింగ్ మిషన్‌ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి నాగేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీతారామారావు, పీసీ, పీఎన్ డీటీ లీగల్ కన్సల్టెంట్ వి.సత్యరవి, డిప్యూటీ డెమో డి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత



వాలీబాల్ కిట్టు అందజేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: యువత క్రీడలపై ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలకు ఎదగాలనే సంకల్పంతో టీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. పోలవరం మండలం చేగొండిపల్లి గ్రామంలోని యువతకు ఈ కిట్లను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాడుం శ్యాంకుమార్, ఈదుపల్లి వెంకట గణేష్, మండల సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయిరామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

చింతలపూడి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, సర్పంచ్ తాండ్ర రామకృష్ణారావు అన్నారు. చింతలపూడి మండలం చింతంపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థుల్లో దేహ దారుఢ్యం పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర అనే క్రీడా పోటీలను ప్రభుత్వం తరుపున పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనాలని కోరారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గోద్రేజ్ ఆగ్రో వెట్ సీఈఓ పొగత నియోగి బహుమతులను అందజేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊటసముద్రంలో వై ఏపీ నీడ్స్ జగన్



ఊటసముద్రం సచివాలయంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురేసిన పార్టీ శ్రేణులు

చింతలపూడి: మండలంలోని ఊటసముద్రం సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో ప్రజలకు కోట్లాది రూపాయల లబ్ధి చేకూరిందని మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లా బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించినట్టు చెప్పారు. గ్రామ వాలంటీర్ల ద్వారా ప్రతి నెలా పెన్షన్ల పంపిణీ విధానంలో పూర్తిగా మార్పు తీసుకొచ్చారని కొనియాడారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు గెలిపించుకోవాలో గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం జాయింట్ సెక్రటరీ ఎస్ భరత్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ గొట్టిపోళ్ల సుధీర్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వరుడైన సుబ్రహ్మణ్యేశ్వరుడు



స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం సుబ్రహ్మణ్యేశ్వరుని పెండ్లి కుమారునిగా, వల్లీ, దేవసేన అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. ఆలయ పరిసరాలను సుగంధభరిత పుష్ప మాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి విశేష అలంకరణలు చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలను చేయువేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం రాత్రి ఆలయంలో ధ్వజారోహణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

ధనుర్మాస పూజలు



ధనుర్మాస పూజల కరపత్రం విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: ధనుర్మాసం సందర్భంగా స్థానిక రాజుల కాలనీలో నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతపూజలు నిర్వహించనున్నట్టు అష్టలక్ష్మీ పీఠాధిపతి శ్రీ గోదా చరణ మంజీర పీతాంబరం రఘునాథచార్య స్వామి తెలిపారు. పట్టణంలోని కోటా రాజు గారి ఇంటి వీధిలో రుద్రరాజు సుధాకర్ రాజు విలేకర్లతో మాట్లాడుతూ రఘునాథ ఆచార్య స్వామి ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస పూజలు నిర్వహిస్తామన్నారు. గోదాదేవి ఆలపించిన గీతాలను ఆలపించి, వాటి భావాలను ప్రజలకు తెలిజేస్తమని చెప్పారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ధనుర్మాస పూజల కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో మహంకాళి రామ్మోహన్, సరళ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: శ్రీచక్ర సహిత నూకాలమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా నిత్య పూజా కైంకర్యాలు, పంచామృత అభిషేకం, సాయం సంధ్యా హారతి పూజలు అర్చకులు మనోజ్ శర్మ నిర్వహించారు. డాక్టర్ రాజాన మాట్లాడుతూ అమ్మవారి రజత (వెండి) వస్త్ర తయారీకి కంచర్ల త్రివిక్రమ దుర్గా బాలకృష్ణ, అనంతలక్ష్మి దంపతులు రూ 10,116, వల్లూరి రాజు, సునీత దంపతులు 10 తులాల వెండి పాల పీరుబాబు,రామలక్ష్మి దంపతులు 5తులాల వెండిని సమర్పించారన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

హైస్కూల్లో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న విజయకృష్ణ

జంగారెడ్డిగూడెం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేసి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కుమారి అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వంటిపల్లి విజయకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని క్లబ్బు ఏర్పాటును పర్యవేక్షించారు. అధ్యాపకులు నవీ క్లబ్ నిర్వహణకు ఎంపికైన విద్యార్థులను సభకు పరిచయం చేశారు. క్లబ్ సభ్యులతో విజయకృష్ణ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తే సమాజం శక్తివంతమౌతుందని అన్నారు. చట్టాలపై అవగాహన కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారుల హక్కుల చట్టం, కమిషన్లు వాటి పనితీరును విజయకృష్ణ వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు కుమారి మాట్లాడుతూ ఈనెల 18 నుంచి పాఠశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, కౌన్సిలర్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి సంతాపం



సాబ్జీకి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కామవరపుకోట: ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ దుర్మరణం ఉపాధ్యాయులకు తీరని లోటని యూటీఎఫ్ మండల నాయకులు శుక్రవారం పేర్కొన్నారు. సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ చిన్నం ప్రశాంత్ కుమార్, యూటీఎఫ్ సభ్యులు ఎ.ఆచార్యులు, ఎస్ సత్యనారాయణ, మల్లా రాజు, ఎ.భూషణరాజు, గోపాలరావు రాజు, ప్రసాద్, మోక్షానందం పాల్గొన్నారు.

సాబ్జీకి జోహార్లు

జంగారెడ్డిగూడెం: విద్యారంగం సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి జోహార్లు అర్పిస్తున్నట్టు భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రామ్మోహన్ పేర్కొన్నారు. సాబ్జీ మృతికి సంతాపం, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సాబ్జీ మృతి పట్ల ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

యూటీఎఫ్ సంతాపం

ద్వారకాతిరుమల: ఎమ్మెల్సీ సాబ్జీ మృతికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గెడ్డం దేవానందరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయరాజు, శ్రీనివాసరావు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పోలవరం సెంటిమెంటుతోనే ప్రభుత్వం ఏర్పాటు



బయ్యనగూడెంలో సమావేశమైన ప్రజాప్రతినిధులు, నాయకులు

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గంలో ఏ పార్టీ విజయం సాధిస్తుందో అదే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే సెంటిమెంట్ పునరావృతం కానుందని వైఎస్సార్‌సీపీనే మళ్లీ ప్రభంజనం సృష్టించనుందని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. శుక్రవారం బయ్యనగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మకమైన అభివృద్ధి సాధిస్తూ దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మా ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని తెలిపారు. ఐదో దఫా తెల్లం బాలరాజు ఎమ్మెల్యేగా పోలవరం నియోజకవర్గంలో గెలవడంతోపాటు నియోజకవర్గానికి మంత్రి పదవిని తీసుకురాబోతున్నారని ఆకాంక్షించారు. బాలరాజుపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయనను ఎదుర్కొనే సత్తాలేక లేనిపోని కల్పితాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో గడపగడపకు పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేసుకున్న బాలరాజు అన్ని వర్గాల ప్రజలకూ మరింత చేరువయ్యారని చెప్పారు. అనంతరం గ్రామంలో జగనన్న పల్లెబాట కార్యక్రమం పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కంభంపాటి బుజ్జిబాబు, పువ్వుల సరి రాంబాబు, కోరుకొండ పుల్లయ్య, అంగర రమేష్, మేకల సత్తిబాబు, పసల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీపై పెసలు పంపిణీ

దెందులూరు: మండలంలో పంట నష్టపోయిన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై పెసలు అందిస్తోందని మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాధిత రైతులు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.